

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,74,497లు, బంగారం 1 గ్రాము 550 మిల్లీగ్రాములు, వెండి 8 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కటక్‌లో ఉద్రిక్తత

కటక్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఇంటర్నెట్ సేవలు బంద్ చేశారు.

- 8లో

సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల మోసం దళారి అరెస్టు

భువనేశ్వర్: పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగ నియామకం రాత పరీక్ష రద్దుకు దారి తీసిన మోసం కేసులో మరో దళారిని ఆదివారం అరెస్టు చేశారు. బాలాసోర్ సింగ్లార్ ప్రాంతీయుడు అరవింద్ దాస్‌ను దళారిగా గుర్తించి క్రైమ్ శాఖ పోలీసులు అరెస్టు చేశారు. గొలంత్రా పోలీస్ ఠాణాలో కేసులో అరెస్టు చేశారు. అరవింద్ నుంచి నేరారోపణ సంబంధిత పత్రాలు దొరికాయని సమాచారం. 114 మంది అభ్యర్థులు, 4 దళారులను అరెస్టు చేశారు.

రావణ దహనంతో .. ముగిసిన వేడుక



జ్యోతిని వెలిగిస్తూ దసరా ముగింపు ఉత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్ వర్మ



రావణ దహనానికి నిప్పు అంటిస్తున్న ముఖ్యఅతిథి రోహిత్

జయపురం:

జయపురం దసరా ఉత్సవ కమిటీ వారి దసర ఉత్సవాలు శనివారం రాత్రి రావన దహనం కార్యక్రమంతో ముగిశాయి. దసరా నాడు పట్టణంలో కుండపోత వాన కురవడంతో రావణ దహనం జరగలేదు. ఈ సందర్భంగా కాల్చిన బాణసంచాలు, మిన్నంటిన తారా జువ్వల పేలుళ్లతో పట్టణం ప్రకాశించింది. స్థానిక దసరా పాడియాలో జరిగిన దసరా ముగింపు వేడుకలను వేలాది మంది ప్రజలు ఆస్వాదించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కొరాపుట్ ఎస్పీ రోహిత్ కుమార్ బర్మ పాల్గొన్నారు. రోహిత్ వర్మ, దసర ఉత్సవ కమిటీ తారాప్రసాద్ బాహిణీపతిలు రావణ బొమ్మకు కలిపిన వైరు ముట్టించి రావణ దహనం చేశారు. అనంతరం దసరా ముగింపు సభ జరిగింది. కమిటీ అధ్యక్షుడు స్థానిక ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈ సభలో దసర స్మరణిక అపరాజిత-2025 పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రజలకు అంకితం చేశారు. అలాగే పరిశోధకుడు, రచయిత డాక్టర్ పరేష్ రథ్ కలం నుంచి వెలవడిన 'మెమోరీ ఆఫ్ జయపురం దసరా' ఆంగ్ల పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో 'అపరాజిత-2025' పుస్తక సంపాదక కమిటీ సభ్యులు జయపురం సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ దాస్, సాహితీ పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయిక్, డాక్టర్ పరేష్ రథ్,నవకృష్ణ రథ్ లను ప్రశంసాపత్రాలు, మెమొంటాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్యే బాహిణీపతి మాట్లాడుతూ దసరా వేడుకలు అంగరంగ వైభవంగా ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. రావణుడి బొమ్మను స్థానిక కళాకారుడు పద్మనాభ చౌదురి తయారు చేశారని పేర్కొన్నారు. ముగింపు వేడుకల్లో గౌరవ అతిథిగా జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డి, జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి పార్థ జగదీస్ కాశ్యప్, జయపురం పంచాయతీ సమితి బీడీఓ శక్తి మహాపాత్రో, జయపురం తహసీల్దార్ సవ్యసాచి జెన, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీణాక్షీ బాహిణీపతి, జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి నిహారంజన్ బిశాయి తదితరులు పాల్గొన్నారు.



రావణుడి బొమ్మ



ప్రసంగిస్తున్న దసరా కమిటీ అధ్యక్షుడు తారా ప్రసాద్ బాహిణీపతి



జయపురం దసరా స్మరణిక' అపరాజిత-2025' ని ఆవిష్కరించిన అతిథులు



దసరా ముగింపు ఉత్సవంలో పాల్గొన్న జన సమూహం



నింగిని తాకుతున్న బాణసంచా వెలుగులు

న్యూస్‌రీల్

పరారైన ఖైదీలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందం

భువనేశ్వర్: కటక్ జిల్లా చౌద్వార్ సర్కిల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు పారిపోయిన విషయం తెలిసిందే. వీరివురి ఆచూకీ కోసం పోలీసు యంత్రాంగం రూ. 50 వేల నగదు పురస్కారం ప్రకటించింది. శుక్రవారం చౌద్వార్ జైలు ప్రహరీ దూకి పారిపోయిన ఇద్దరు ఖైదీల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారుల బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన అనుభవజ్ఞులైన అధికారులను ఈ బృందంలోకి తీసుకున్నారు. చౌద్వార్ జైలు రోడ్డు నుంచి చరబటియా వరకు దారి పొడవునా ఏర్పాటు చేసిన అన్ని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నారు. చరబటియా, నెర్గుండి, టంగి మరియు కటక్ నగరంలోని రైల్వే స్టేషన్లలో పోలీసులు భద్రతను పెంచారు. పారిపోయిన ఖైదీలను పట్టుకోవడానికి ఈ ప్రదేశాలలో రాత్రిపూట తనిఖీలు కొనసాగిస్తున్నారు.

చెరువులో మునిగి ఏడేళ్ల బాలుడు మృతి

మల్కన్‌గిరి: చెరువులో మునిగి ఏడేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మలకన్‌గిరి జిల్లా కలిమెల సమితి వెంకటపాలెం పంచాయతీ యం.వి.74 గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాబులి డాంగీ కుమారుడు ఆయుష్ డాంగీ (7) తోటి పిల్లలతో ఆడుకుంటూ చెరువు వైపు వెళ్లి ప్రమాదవశాత్తూ పడిపోయాడు. దీంతో వెంట ఉన్న పిల్లల కేకలు విన్న స్థానికులు వచ్చి ఆయుష్ డాంగీని బయటకుతీసి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి బాలుడు మృతి చెందినట్టు నిర్ధారించారు. విషయం తెలిసిన పోలీసు ఐఐసీ ముకుందో మేళ్క ఆరోగ్య కేంద్రానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


చెరువులో పడి ఒక వ్యక్తి గల్లంతు



చెరువులో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి గువులి గ్రామంలోని చెరువులో పడి ఒక వ్యక్తి గల్లంతు అయ్యాడు. శనివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన చూసిన వారు వెంటనే కొట్‌పాడ్ అగ్ని మాపక విభాగ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చెరువులో గల్లంతయిన వ్యక్తి కోసం గాలించారు. గల్లంతయిన వ్యక్తి కొట్‌పాడ్ సమితి అసన గ్రామానికి చెందిన కెమెరాజ్ పూజారిగా స్థానికులు అనుమానిస్తున్నారు.

నాలుగు కాళ్ల కోడి



జయపురం: బొరిగుమ్మ సమితి కొశాగుడ గ్రామంలో గల మెగా ఫౌల్ట్రీలో ఒక కోళ్ల ఫారంలో ఒక కోడికి నాలుగు కాళ్లు కనిపించాయి. నాలుగు దినాల కిందట చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి కోళ్ల లోడు కొశాగుడలో కోళ్ల ఫారానికి వచ్చింది. కోళ్లు అన్‌లోడ్ అయి ట్రక్కు వెళ్లిపోయింది. కోళ్లు అమ్ముతున్న సమయంలో వాటిలో ఒక కోడికి నాలుగు కాళ్లు ఉండటం కనిపించింది. రెండు సాధారణ కాళ్లతో పాటు చిన్నగా మరో రెండు కాళ్లు ఉన్నాయి. దీంతో ఈ కోడిని చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు.

రద్దు చేసిన పరీక్షల నివేదికను సమర్పించాలి

భువనేశ్వర్: రద్దు చేసిన ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల సమగ్ర వివరాలతో నివేదిక దాఖలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్ష రద్దు నేపథ్యంలో ఈ ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం. భారీ స్థాయిలో మోసం చోటు చేసుకోవడంతో రద్దు అనివార్యం అయినట్లు తేటతెల్లం అయింది. ఇటీవల కాలంలో తరచూ ఉద్యోగ నియామకాల పరీక్షలు రద్దు అవుతున్నట్లు విపక్షం ప్రభుత్వంపై వేలెత్తి చూపింది. రాష్ట్ర ప్రభుత్వ అన్ని నియామక బోర్డులు, కమిషన్లు రద్దు చేసిన పరీక్షల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. గత ఏడాది (2024) జూన్ నుంచి నేటి వరకు రద్దు చేయబడిన ఉద్యోగ నియామకాల పరీక్ష నివేదికను సమర్పించాలని పేర్కొన్నారు. తక్షణమే ఈ నివేదికను సిద్ధం చేసి ఈ-మెయిల్ చేయాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

కొండచరియల ప్రమాదాల నివారణకు వ్యూహాత్మక ప్రణాళిక

భువనేశ్వర్: కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళిక రూపొందిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి ప్రకటించారు. మానవ ప్రాణ హాని నివారణ దీని లక్ష్యంగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొండ ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడే ప్రమాద ప్రాంతాలను మ్యాపింగ్ చేయడం, గుర్తించడంపై ఈ చొరవ దృష్టి సారిస్తుందన్నారు. ఇటీవలి కొండచరియల ప్రమాదం వల్ల ప్రభావితమైన కుటుంబాలకు సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. నష్టం అంచనా నివేదికలను సమర్పించాలని జిల్లా కలెక్టర్లను కోరారు. బాధిత కుటుంబాలకు పరిహారం తక్షణమే పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుంది. జల దిగ్బంధంలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాలను గుర్తించి అంతరాయం లేకుండా అనుసంధానం కోసం చర్యలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు. దుర్బలమైన ప్రాంతాలను గుర్తించి సముచిత ప్రణాళికతో మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేకంగా సూచించారు. ఇటీవల అల్పపీడన వ్యవస్థ కారణంగా కురిసిన కుండపోత వర్షాలు గజపతి, రాయగడ, కలహండి జిల్లాల్లో భారీ నష్టాన్ని కలిగించాయి. రాయగడలోని నివాసితులను ఖాళీ చేయగా కలహండిలోని 9 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. గజపతి తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంది. గనుల మంత్రి బిభూతి భూషణ్ జెనా రెండు రోజుల పాటు బాధిత ప్రాంతాల్లో సహాయ, పునరుద్ధరణ చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. రాష్ట్రంలోని దుర్బల ప్రాంతాలను రక్షించడానికి దీర్ఘకాలిక చర్యలు ప్రణాళిక చేస్తున్నప్పటికీ, పరిస్థితి అదుపులోకి వచ్చిందని మంత్రి సురేష్ కుమార్ పూజారి హామీ ఇచ్చారు.

దుర్గా పూజ ప్రభలకు ప్రత్యేక ఆర్థిక ప్రోత్సాహం: ముఖ్యమంత్రి



భువనేశ్వర్: దసరా సందర్భంగా దుర్గా పూజా మండపాల్లో ధగేలుమనిపించే ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రధానంగా కటక్ మహానగరం దీనికి ప్రసిద్ధి చెందింది. బంగారం, వెండి వంటి విలువైన హంగులతో దుర్గా మాతకు అలంకరణలో ఉత్సాహంగా పోటీ పడుతున్నారు. ఈ రంగంలో కటక్ మహా నగరం శతాబ్దాల చరిత్ర మూటగట్టుకుంది. ఆయా నిర్వాహకులకు ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఆమోదం మేరకు సమగ్రంగా 1,085 దుర్గా ప్రభలకు ఆర్థిక సహాయం అందజేసేందుకు ఖరారు చేశారు. దీని వ్యయ ప్రణాళిక రూ. 7 కోట్ల 1 లక్ష 40 వేల రూపాలుగా ప్రకటించారు. దుర్గా మండపాలపై శోభిల్లే ప్రభల్ని 3 వర్గాలుగా విభజించి ఈ ఆర్థిక సహాయం అందజేస్తారు. చారిత్రాత్మక వారసత్వం, 75 ఏళ్ల పైబడిన చరిత్ర, 50 ఏళ్లు పైబడి నిరవధికంగా కొనసాగుతున్న ప్రభల అలంకరణ పూజా మండపాలుగా విభజించారు. చారిత్రాత్మక వారసత్వం కలిగిన 215 ప్రభలకు 2 కోట్ల 17 లక్షల రూపాయలు, 75 ఏళ్ల చరిత్ర కలిగిన 197 ప్రభలకు 1 కోటి 47 లక్షల రూపాయలు, 50 ఏళ్లు పైబడిన 673 ప్రభలకు 3 కోట్ల 36 లక్షల రూపాయలు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది.

ఐటీఐ ఉత్తమ ఉత్తీర్ణులకు ప్రధాని సత్కారం



ప్రధాన మంత్రి చేతుల మీదుగా ప్రత్యేక బహుమానం పొందిన ప్రమోద్ దళపతి



ప్రధాన మంత్రి సత్కారం పొందిన జితేంద్ర ప్రధాన్

భువనేశ్వర్: వృత్తి విద్యా (ఐటీఐ) కోర్సులో ఉత్తమ ఉత్తీర్ణత సాధించిన ఇద్దరు విద్యార్థులు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతీయ స్థాయి మేటి విద్యార్థులుగా ప్రత్యేక బహుమానాలు అందుకున్నారు. న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ కౌశల్ దీక్షాంత్ సమరోహ కార్యక్రమంలో ప్రధాన మంత్రి వీరివురికి జాతీయ స్థాయి పురస్కారాలు అందజేశారు. ఎలక్ట్రానిక్స్ మెకానిక్ ట్రేడ్‌లో 2025 జాతీయ స్థాయి టాపర్ అవార్డుతో కంధమల్ జిల్లా ఫుల్బాణి ప్రభుత్వ ఐటీఐ నుండి ప్రమోద్ దళపతి, గంజాం జిల్లా హింజిలికట్ ఐటీఐ ప్రభుత్వ పూర్వ విద్యార్థి, ఎస్ఎస్‌టీఐ భువనేశ్వర్ విద్యార్థి జితేంద్ర ప్రధాన్ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ పరీక్షలో జాతీయ స్థాయిలో ఉత్తమ ఉత్తీర్ణత సాధించి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రత్యేక బహుమానం పొందారు.

బస్సు, ట్రక్ ఢీ ఒకరు మృతి

- 20 మందికి గాయాలు



ప్రమాద దృశ్యం

కొరాపుట్: ప్రైవేటు బస్సు, ట్రక్ ఎదురెదురుగా ఢీకున్న సంఘటనలో ఒకరు మృతి చెందగా 20 మందికి తీవ్రగాయాలయ్యాయి. నబరంగ్‌పూర్ జిల్లా సరిహద్దులో జాతీయ రహదారి-26పై పపడాహండి సమితి కేంద్రానికి చివర్లో అంపానీ ఘాట్‌లో ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. భవానీపట్న నుంచి నబరంగ్‌పూర్ వైపు బస్సు వస్తుండగా.. ఇదే సమయంలో ట్రక్ పపడాహండి నుంచి భవానీ పట్న వైపు వెళ్తుంది. ఘాట్‌లో మలుపు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ట్రక్ డైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పపడాహండి, అంపానీల నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పపడాహండి, నబరంగ్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. మృతి చెందిన ట్రక్ డ్రైవర్ పశ్చిమ బంగావాసి అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

వంతెన కొట్టుకుపోయినా పట్టని అధికారులు



వరదలకు కొట్టుకుపోయిన వంతెన



అశ్రియగడ వంతెన వద్ద ప్రజలతో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: తీవ్ర వర్షాలకు గజపతి జిల్లా గుమ్మా బ్లాక్ అశ్రియగడ, బురిడి గ్రామ పంచాయతీలకు కలుపుతూ ఉన్న వంతెన కూలి పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకూ గుమ్మా బ్లాక్ బీడీవో, తహసీల్దార్ అశ్రియగడ గ్రామాన్ని సందర్శించలేదు. గుమ్మా సమితి కేంద్రానికి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న అశ్రియగడలో వరదలకు వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. కాగా పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఆదివారం అశ్రియగడను సందర్శించి ప్రజలతో మాట్లాడి, అధికారులకు ఫోన్ చేశారు. వెంటనే వంతెన మరమ్మతులు చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీరుకు ఫోన్ చేసి ఆదేశించారు.

బయటపడిన కారు, శవం



ఆర్.ఉదయగిరి వద్ద వరదల్లో కొట్టుకుపోయిన కారు



కారులో ఇరుక్కున్న ప్రతాప్ పండా శవం

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి వద్ద నాలుగు రోజుల కిందట భారీ వర్షాలకు కలియాతుట్ట నదిలో ఒక కారు కొట్టుకుపోయింది. నదిలో వరద నీరు తగ్గడంతో కారును అగ్నిమాపక దళం బయటకు తీసింది. అందులో వ్యక్తి శవం లభ్యమైంది. కారులో ఇరుక్కుని మృతిచెందిన వ్యక్తి ప్రతాప్ పండా (50) గా ఆర్.ఉదయగిరి ఎస్ఐ సందీప్ హేంబ్రం తెలియజేశారు. దసరా నాడు ప్రతాప్ పండా ఆర్.ఉదయగిరికి దగ్గరలో ఉన్న తరబా గ్రామంలో తన దుకాణం పూజ కోసం వెళ్లి కారుతో సహా కొట్టుకుపోయాడు. ఆయన ఆచూకీ కోసం వెదకగా ఈ రోజు నదిలో వరద నీరు తగ్గటంతో కారుతో సహా దొరికాడు. పోలీసులు ఈ కేసును విచారణ చేస్తున్నారు.

ట్రక్‌ను ఢీకొన్న బైక్‌లు.. ముగ్గురు మృతి



ఘటన స్థలంలో మృతదేహాలు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి కోత్తమిట పంచాయతీ తంగగూడ గ్రామం వద్ద శనివారం రాత్రి ఆగి ఉన్న ట్రక్‌ను రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఘటనలో ముగ్గురు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రక్ బ్రేక్‌డౌన్ కావడంతో రహదారి ఒడ్డున నిలిచిపోయింది. శనివారం రాత్రి 9 గంటల సమయంలో వర్షం పడుతుండగా బైక్ వచ్చి ట్రక్‌ను ఢీకొంది. స్థానికులు ప్రమాదాన్ని గమనించి వెంటనే అంబులెన్స్‌ను పిలిపించి క్షతగాత్రులను మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ఒకరు మృతి చెందారు. మరికొంత సమయానికి మరో బైక్‌పై మల్కన్‌గిరి సమితి సింద్రీమాల గ్రామానికి చెందిన భీమ్ ఖీలో, సుక ఖీలో వస్తూ ట్రక్‌ను ఢీకొన్నారు. దీంతో వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఆదివారం భీమ్ ఖీలో మృతదేహంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో సంఘటన స్థలానికి వెళ్లి గ్రామస్తులతో చర్చించారు. ట్రక్‌ను తొలగించకపోవడం వల్లనే ప్రమాదాలు జరిగాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఐఐసీ మాట్లాడుతూ ట్రక్‌లో ఇనుప సామాన్లు ఉండడం వల్ల తొలగించడం కష్టమైందని తెలిపారు. మృతదేహాలను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

రూ.లక్ష పలికిన లడ్డూ



లడ్డూతో భక్తులు

వజ్రపుకొత్తూరు: కొండవూరులో వేద సరస్వతీ దేవి 28వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసి ఉత్సవాల్లో అమ్మవారి లడ్డూ పాట రూ.100500 పలికింది. శనివారం రాత్రి నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన కోనారి రాజశేఖర్ లడ్డూను కైవసం చేసుకున్నారు. దేవీ వస్త్రాన్ని రూ.17001లకు లండ నరేష్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీ-10 భారత్ జట్టుకు ఈశ్వర్‌రెడ్డి ఎంపిక



ఈశ్వర్‌రెడ్డి

టెక్కలి రూరల్: అంతర్జాతీయ స్థాయి సెకండ్ ఏషియన్ టీ-10 ఇండియా క్రికెట్ జట్టుకు కోటబొమ్మాళి గ్రామానికి చెందిన మూగి ఈశ్వర్‌రెడ్డి ఎంపికైనట్లు అసోషియేషన్ ప్రతినిధులు సుకుమార్, రాంబాబు ఆదివారం తెలిపారు. థాయిలాండ్‌లో పోటీలు జరుగుతాయని, సుమారు రూ.లక్షా 50వేలు ఖర్చు అవుతుందని ఈశ్వరరెడ్డి చెప్పారు. తనది పేద కుటుంబమని, దాతలు సహకరించాలని, వివరాలకు 9493740222 సంప్రదించాలని కోరారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



త్రినాథ్ మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం వారిది. పొట్ట కూటి కోసం ఇతర ప్రాంతానికి వెళ్లి పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. తేలుకుంచి గ్రామానికి చెందిన మేరుగు త్రినాథ్(55) ఇతర ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య వరలక్ష్మీ, పెళ్లీడుకొచ్చిన కుమార్తె శారద ఉంది. ఆదివారం విశాఖపట్నంలో కూలి పనుల కోసం బయల్దేరిన త్రినాథ్ ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో బెర్హంపూర్-విశాఖ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు ఫ్లాట్ ఫాం మధ్య పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో సీహెచ్‌సీకి తరలించగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమణమూర్తి

శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కార్యాచరణలో భాగస్వామ్యం వహించే ఉద్యోగులను పాలకులు చిన్నచూపు చూడటం తగదన్నారు. డీఏలు సకాలంలో విడుదల చేయాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని, పీఆర్‌సీ అమలయ్యే వరకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో కేంద్ర ప్రభుత్వం ఆ ఉద్యోగులకు ఇటీవలే డీఏ ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రెండేళ్లుగా డీఏలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిలపై ప్రభుత్వం రోడ్డు మ్యాప్ ప్రకటించాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రంలో ఉన్న 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో కలిసి ఐక్య ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ నాయకులు పి.ప్రభాకరరావు, ఎం.సన్యాసిరావు, పి.రామకృష్ణ, రాజేశ్వర రావు, జి.శ్రీనివాసరావు, జి.తిరుమలరావు, సీహెచ్ జగన్, రామచంద్రరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంచిలి: సూదిపుట్టుగ గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం రాత్రి దాడిచేశారు. గ్రామానికి చెందిన ప్రేమ్ దొళాయి అనే వ్యక్తికి చెందిన ఇంటి టెర్రస్‌పై రేకుల గదిలో కోతముక్కల పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు సిబ్బందితో వెళ్లారు. ప్రేమ్ దొళాయితో పాటు మరో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.92,960 నగదు, 13 మొబైల్ ఫోన్లు, 3 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రాకపోకలు బంద్



మలాస్ పదర్ పంచాయతీ భలియాగుడ వద్ద కూలిన కల్వర్టు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా సమితి మలాస్ పదర్ గ్రామ పంచాయతీ భలియగుడలో ఇటీవల విజయదశమి రోజు కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారి మోహనా- బోడోగోడో రోడ్డుకు అనుసంధానం కరియంబు జంక్షన్ వద్ద కల్వర్టు కూలింది. మూడు పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయాయి. కల్వర్టు కూలిపోవడంతో పంట భూములు వరదనీటితో నిండిపోయి జొన్న, మొక్కజొన్న, వరి, రాగు పంటలు నాశనం అయ్యాయి. ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు, మోహనా బ్లాక్ అభివృద్ధి అధికారి గ్రామాన్ని సందర్శించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయినా.. అధికారులు మలాస్ పదర్, భలియగుడ గ్రామాలను సందర్శించలేదని ప్రజలు చెబుతున్నారు. మూడు నెలల క్రితం జిల్లా కలెక్టర్ మధుమిత భలియాగుడ సందర్శించినప్పుడు పేదలకు పి.ఎం. యోజన పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఆ హామీ అమలు కాలేదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా మలాస్ పదర్ గ్రామ పంచాయతీలో భలియా గుడలో ప్రజలు కష్టాలు వినాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వరదలకు నాశనమైన పంట పొలాలు



మోహనా బ్లాక్ భలియాగుడ గ్రామస్తులు

నేటి నుంచి నందన్న ఉత్సవాలు



కటిక వీధిలో నందన్న విగ్రహాలు తయారుచేసి ఉపాధి పొందుతున్న మహిళ



పర్లాకిమిడి మార్కెట్‌లో పండ్ల విక్రయిస్తున్న మహిళ

పర్లాకిమిడి: జిల్లాలోని నందన్న ఉత్సవాలకు గ్రామీణులు సన్నద్ధం అవుతున్నారు. దీపావళి వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ గ్రామంలో ఇంటింటికీ వచ్చే నందన్నకు కాలుకడిగి ఆశీర్వదం అందుకుంటారు. పర్లాకిమిడితోపాటు కాశీనగర్, గుసాని ప్రాంతాల్లో ఈ పండగ నిర్వహిస్తారు. మార్కెట్‌లో పండ్లు, కొబ్బరికాయలు, అరటి పండ్లు, తోరణాలు అధిక ధరలు పలికాయి. చిత్రకార వీధిలో నందమ్మలు తయారుచేసే కళాకార కుటుంబాలు ఈఏడు నందన్న విగ్రహాలు ఆర్డర్లతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమ, మంగళవార్లో తగులు, మిగులుతో ఈ పండగ చేసుకుంటున్నట్టు భక్తులు తెలిపారు. ఒక నందన్నను రూ.2500, వినాయకునితో కలిసి ఉన్న నందన్న రూ.3500లకు అమ్ముతున్నట్టు కటికవీధిలో ఒక కళాకారిణి తెలియజేశారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న నందన్న విగ్రహాలు

సమితి అధ్యక్షురాలిపై అవిశ్వాస తీర్మానం



ఎన్నికలో ఓట్లు వేసిన ప్రజాప్రతినిధులతో బీజేడీ శ్రేణులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంధ్ర పంచాయతీ సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ పదవికి రాజీనామా చేసినా.. ముందుగా సబ్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఆమెపై వచ్చిన అవిశ్వాస తీర్మానంపై అధికారులు ఓటింగ్ నిర్వహించారు. రాజేశ్వరి పొరజపై సర్పంచ్‌లు సమితి సభ్యులు పలు ఆరోపణలు చేసి ఆమెపై అవిశ్వాస తీర్మానం తీసుకు వచ్చారు. ఆమె ఎట్టకేలకు తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. అయినా ఆమెపై వచ్చిన అవిశ్వాస తీర్మానంపై ఆదివారం ఓటింగ్ జరిపారు. కుంధ్రా తహసీల్దార్, మరయు మెజిస్ట్రేట్ బినోద్ కుమార్ నాయక్ నేతృత్వంలో పంచాయతీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలిపై అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. ఎన్నికల నియమం ప్రకారం అధికారులు ప్రజాప్రతినిధుల సమక్షంలో ఓట్లు లెక్కించారు. ఓట్ల లెక్కింపులో అవిశ్వాస తీర్మానాన్ని సమర్థిస్తూ 28 మంది ఓటు చేయగా.. వ్యతిరేకిస్తూ ఒక్క ఓటు కూడా పడలేదని అధికారి వెల్లడించారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించిన అధికారులు ఓట్లు బ్యాలెట్ బాక్స్‌లో పెట్టి సీజ్ చేశారు. అధ్యక్షురాలు రాజీనామా చేయటంతో అధ్యక్ష ఎన్నికలు జరిగినంత వరకు ఉపాధ్యక్షుడు తురణ సేన్ బిశాయి అధ్యక్ష బాధ్యతలు నిర్వహించాలని ఎన్నికల అధికారి తహసీల్దార్ తెలియజేశారు. ఎన్నిక ఫలితాలు వెల్లడి కాగానే ప్రజాప్రతినిధుల్లో, బీజేడీ శ్రేణల్లో ఉత్సాహం వెల్లువిరిసింది. మాజీ ఎంపీ, బీజేడీ నేత ప్రదీప్ మఝి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధావినోదిని సామంతరాయ్, కుంధ్ర బ్లాక్ బీజేడీ అధ్యక్షుడు బృంధావన మల్లిక్, జయపురం శాసన సభ నియోజకవర్గం బీజేడీ నేత ధర్మేంద్ర అధికారి పాల్గొన్నారు.

కటక్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తత

- 24 గంటల పాటు ఇంటర్నెట్ నిలిపివేత

భువనేశ్వర్: కటక్ మహా నగరంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. దుర్గా విగ్రహాల అనుపు ఊరేగింపు పురస్కరించుకుని చెలరేగిన వివాదం కొలికి రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి మరింత హింసాత్మకం కాకుండా భద్రతా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం కటక్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్, సోషల్ మీడియా సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్ చాట్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే తప్పుడు, రెచ్చగొట్టే, వివాదాస్పద సందేశాలు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత సాహు జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం, 1885, టెలికాం సేవల తాత్కాలిక సస్పెన్షన్ (పబ్లిక్ ఎమర్జెన్సీ/పబ్లిక్ సేఫ్టీ) నియమాలు, 2017లోని నిబంధనల ప్రకారం ఈ నెల 5న (ఆది వారం) సాయంత్రం 7 గంటల నుండి మర్నాడు 6న (సోమ వారం) సాయంత్రం 7 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని ఉత్తర్వులు పేర్కొన్నాయి. కటక్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రాంతం, కటక్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీడీఏ) ప్రాంతం, 42 మౌజా ప్రాంతంలోని అన్ని మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ సేవలకు తాత్కాలిక ఇంటర్నెట్ షట్‌డౌన్ వర్తిస్తుంది. నగరంలో ఉద్రిక్తత పెరుగుతున్న నేపథ్యంలో మతపరమైన సందేశాలను వ్యాప్తి చేయడానికి ఇంటర్నెట్ దుర్వినియోగం జరుగుతోందని కటక్ జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి రాసిన లేఖలో ఆందోళన వ్యక్తం చేసిన తర్వాత ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. శాంతి పునరుద్ధరణ, శాంతిభద్రతల పరిరక్షణ దిశలో ఈ చర్యని చేపట్టినట్లు వివరించారు.

శాంతికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి

నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ముఖ్యమంత్రి ఇచ్చారు. ఐక్యత, సోదరభావానికి ప్రసిద్ధి చెందిన 1,000 సంవత్సరాల పురాతన నగరంగా కటక్‌లో దీర్ఘకాల మత సామరస్యం వారసత్వాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆదివారం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అల్లర్లతో ప్రభావితమైన శాంతి, క్రమశిక్షణ మరియు సామరస్యాన్ని కాపాడుకోవాలని ముఖ్యమంత్రి నగర వాసుల్ని కోరారు. ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శాంతి పునరుద్ధరణ కోసం ప్రజలకు అభయం ఇచ్చేందుకు కమిషనరేట్ పోలీసులు ఆదివారం నగరంలో సీనియర్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆందోళనకారులను గుర్తించి పట్టుకోవడానికి కటక్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనర్ ఎస్ దేవ్ దత్త సింగ్ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు దుండగుల కోసం గాలిస్తున్నాయి.

ఎయిర్‌పోర్టు సదస్సు బహిష్కరణ

- హాజరు కాని ఉద్దానం రైతులు
- సహకరించాలని ఎమ్మెల్యే వేడుకోలు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

పలాస: పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు, మందస మండలాల ఉద్దానం ప్రాంతంలో తలపెట్టిన కార్గో ఎయిర్‌పోర్టును ఉద్దానం ప్రజలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, సంబంధిత రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఎయిర్‌పోర్టు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అవగాహన అంటూ ఏర్పాటు చేసిన ఈ సదస్సును ఉద్దాన ప్రాంత రైతులు బహిష్కరించారు. ముందు రోజే గ్రామ సచివాలయాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను రప్పించి ఎయిర్‌పోర్టుకు అనుకూలంగా మాట్లాడించుకున్నారు. ఎయిర్ పోర్టు చాలా అవసరం అంటూ, ఉద్దానం అభివృద్ధి చెందాలంటే తాము భూములు ఇవ్వడానికి సిద్ధమేనని, అయితే ప్రజల్లో, రైతుల్లో నష్ట పరిహారం విషయమై సందేహాలు ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు. ఎకరా భూమికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా మాట్లాడుతూ ప్రజా సంఘాల నాయకులు రకరకాల రంగుల జెండాలతో ఎక్కడి నుంచో వచ్చి రెచ్చగొడుతున్నారని, పర్యావరణ కాలుష్యం అంటున్నారని, అసలు ఎయిర్‌పోర్టు వద్దంటున్నారని, వారికి అభివృద్ధి అంటే అక్కర్లేదని, వారి ఇళ్ల ముందు మురుగు కాలువలను శుభ్రం చేయరని పరుష పదజాలంతో మాట్లాడారు. ప్రజలను చేతులెత్తి వేడుకుంటున్నానని, ఎయిర్‌పోర్టుకు సహకరించాలని కోరారు.

ఎయిర్ పోర్టుతో మేలే..

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కార్గో ఎయిర్‌పోర్టు వల్ల ఉద్దానం ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఉద్దానం రూపురేఖలు మారుతాయన్నారు. చాలా మందికి అపోహలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయడానికే ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులు అభిప్రాయాలు తెలుసుకోకుండా ఒక్క అడుగూ ముందుకు పడదని, రేపటి నుంచి గ్రామాల్లోకి అధికారులు వస్తారని వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏ.పి.స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డీఓ జి.వెంకటేష్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పలాస, మందస, వజ్రపుకొత్తూరు తహశీల్దార్లు పాల్గొన్నారు.

వరల్డ్ బ్యాడ్మింటన్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా మోహన్‌సాయినాథ్



మోహన్‌సాయినాథ్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు టెక్నికల్ అఫీషియల్ (లైన్ జడ్జి)గా ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం గ్రామానికి చెందిన సంపతిరావు మోహన్‌సాయినాథ్ నియామకమయ్యారు. ఈ పోటీలు అసోంలోని గౌహతి వేదికగా ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ సంజయ్ మిశ్రా నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈయన అంతర్జాతీయ క్వాలిఫైడ్ రిఫరీ, శ్రీకాకుళం జిల్లా బాడ్మింటన్ సీఈఓ సంపతిరావు సూరిబాబు కుమారుడు. తండ్రీకొడుకులు ఇద్దరూ జూనియర్ వరల్డ్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్లగా నియామకం కావడం విశేషం.

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

దాతృత్వం..



అనాథ బాలల భోజనం పెడుతున్న పూజా హోటల్ యజమాని బిభూతి భూషణ్ లెంక

కొరాపుట్: హోటల్ ప్రారంభం సందర్భంగా అనాథ పిల్లలకు విందు ఇచ్చి యజమాని దాతృత్వం చాటుకున్నారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో జగన్నాథ మందిరం సమీపంలో గల పూజా హోటల్ పునః ప్రారంభమైంది. కొద్ది రోజుల క్రితం అగ్ని ప్రమాదంలో ఈ హోటల్ దగ్ధమైంది. హోటల్ ప్రారంభం సందర్భంగా మజ్జిగుడలోని దీన దయాల్ బాలికా ఆశ్రమం, సింధిగుడలోని ఉత్కళ బాలాశ్రమం, పట్టణంలోని మున్సిపల్ స్వీపర్ కాలనీకి చెందిన సుమారు 200 మంది పిల్లలకు భోజనం పెట్టారు. హోటల్ యజమాని బిభూతి భూషణ్ లెంక బాలలకు స్వాగతం పలికారు. పిల్లలకు నచ్చిన మిఠాయిలు, ఐస్ క్రీంలు, టిఫిన్, బిర్యానీ పెట్టారు. బ్యాగ్‌లు, విద్యా సామగ్రి ఉచితంగా అందజేశారు. అనంతరం పిల్లలందరినీ వారి ఆశ్రమాలకు సొంత ఖర్చులతో బిభూతి భూషణ్ లెంక పంపించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి స్వయంగా బాలలకు కావాల్సిన వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నబరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కును నాయక్, సీనియర్ న్యాయవాది జడేశ్వర్ ఖడంగా, కౌన్సిలర్ ఎ.సతీష్ పాల్గొన్నారు.

ఇలా కట్టారు..అలా కూలింది..

- కాలువ పనుల్లో బయటపడిన డొల్లతనం
- కానరాని అధికారుల పర్యవేక్షణ



టెక్కలి మండా పాలం కాలనీ వద్ద కూలిన కాలువ గోడ

టెక్కలి: కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వెరసి పది కాలాల పాటు ఉండాల్సిన నిర్మాణాలు రోజుల వ్యవధిలోనే కూలిపోతున్నాయి. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో మండపాలం కాలనీ వద్ద పాత జాతీయ రహదారికి ఆనుకుని చేపడుతున్న మురుగు నీటి కాలువ నిర్మాణంలో నాణ్యత లేని పనుల డొల్లతనం బయటపడింది. సుమారు రూ.1.98 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ కాలువ నిర్మాణం చేపడుతున్నారు. ఓవైపు పనులు చేస్తుండగానే మరో వైపు కాలువ గోడలు కూలిపోతున్నాయి. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో కాలువ నిర్మాణాలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలు ఈ పనులు చేస్తుండడంతో అధికారులు తమకేమీ పట్టనట్లుగా కనీసం పర్యవేక్షణ చేయడం మానేశారు. దీంతో కాలువ పనులు మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ పోటీలు



రెజ్లింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న సంఘ ప్రతినిధులు, పీడీలు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: మలివిడత స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీల ప్రక్రియ మొదలైంది. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు చేపట్టారు. ఐదురోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో తొలిరోజు 12 క్రీడాంశాల్లో ఎంపికలు జరిగాయి. హాకీ ఎంపికలు శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో, వెయిట్‌లిఫ్టింగ్- పెద్దపాడులో, రెజ్లింగ్- పెద్దపాడులో, ఆర్చరీ- రాజ్‌కుమార్ అకాడమీ శ్రీకాకుళంలో, రగ్బీ, నెట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, షూటింగ్‌బాల్ ఎంపికలు- టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో, టేబుల్‌టెన్నిస్- శాంతినగర్‌కాలనీలో డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం, యోగా- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సత్యవరం, నరసన్నపేట మండలం, లాన్‌టెన్నిస్- శ్రీకాకుళం ఆర్ట్స్‌కాలేజ్ టెన్నిస్ అకాడమీలో, కరాటే ఎంపికలు శ్రీకాకుళం మహాలక్ష్మినగర్‌కాలనీలోని శ్రీచైతన్య స్కూల్ వేదికగా ఎంపికలను పూర్తిచేశారు. త్వరలో తుది జట్ల జాబితాను ప్రకటిస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, కె.మాధవరావు పర్యవేక్షించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సలహాదారు పి.సుందరరావు, ఆయా క్రీడాంశాల సెలక్టర్లు, పీడీ, పీఈటీలు ఎంపికలను నిర్వహించారు.

యోగా క్రీడాకారుల ఎంపికలు

నరసన్నపేట: స్కూల్ గేమ్స్‌లో సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో యోగా పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ సలహాదారు కె.రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో సత్యవరం స్కూల్ నుంచి బి.జస్వంత్, బి.రాజ్యణి, ఆర్. రమేష్‌లు ఎంపికయ్యారని ఎంఈఓ శాంతారావు తెలిపారు. పీఈటీలు జ్యోతీ రాణి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

టెక్కలి: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా జట్లు ఎంపికలను ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. అండర్ -14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్, షూటింగ్ బాల్ తదితర విభాగాల్లో జిల్లా జట్లు ఎంపికలు నిర్వహించారు. 95 పాఠశాలల నుంచి 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. టెక్కలి డివిజన్ ఇన్‌చార్జి బి.నారాయణరావు, పీడీలు కె.కె.రామిరెడ్డి, ఎస్.లక్ష్మణరావు, ఎస్.కృష్ణారావు, ఎన్.నాగరాజు, పి.వెంకటరమణ, డి.లక్ష్మినారాయణ, అలివేణి, నర్మద పర్యవేక్షించారు.

అమ్మో.. మెమో!

- జిల్లా వైద్యారోగ్య శాఖలో గ్రూపుల గోల
- వరుస మెమోలు జారీ చేస్తున్న ఓ అధికారి
- ఇప్పటికే ఏడుగురు ఉద్యోగులకు 20కి పైగా మెమోలు జారీ



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

అరసవల్లి : వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఇప్పుడు కొత్తగా వర్గపోరు ఎక్కువైంది. మాట్లాడితే మెమో అన్న చందంగా 'పరిపాలన' సాగుతోంది. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలక స్థానాల్లో ఉన్న రెండు సీట్ల మధ్య అంతర్గత పోరు.. పలు రకాల వివాదాలకు కేంద్రమవుతోంది. ఇక అవినీతి విషయంలో ఏకంగా డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ ఏసీబీకి చిక్కగా.. అక్రమాల్లో కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్ విధుల నుంచి సస్పెండయ్యారు. ఇలా ఈ కార్యాలయంలోని కీలక స్థానాలకు పెద్ద ఎత్తున అవినీతి మరకలంటాయి. రెండు మూడు నెలలుగా సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌కు, కార్యాలయ పరిపాలనాధికారి బాబూరావు మధ్య అభిప్రాయ భేదాలు ఎక్కువయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఇరు కీలక ఉద్యోగులకు సన్నిహితుల మధ్య వర్గ పోరు నడుస్తోంది. సూపరింటెండెంట్ సస్పెన్షన్ తర్వాత ఆయన వర్గానికి చెందిన పలువురు ఉద్యోగులకు మెమోల రూపంలో చర్యలు వెంటాడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుట్రలో భాగంగానే క్రమశిక్షణ చర్యలకు దిగుతున్నారని ఆరోపణలు జోరందుకున్నాయి.

రెండు నెలల్లో 20 మెమోలు...!

జిల్లా వైద్యారోగ్య శాఖలో మెమోల జారీ ఎక్కువయ్యింది. ఇటీవల ఏఎస్ఎంల (సచివాలయం) బదిలీల్లో బాగా జేబులు నింపుకొన్న ఓ అధికారి అంతా తానై వ్యవహరించడంతో పాటు అడ్డొచ్చినా.. అడ్డు చెప్పినా క్రమశిక్షణ చర్యలే అంటూ వ్యవహారం నడుపుతున్నారనే చర్చ జోరందుకుంది. రెండు మూడు నెలల్లోనే జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సబార్డినేట్, టైపిస్టు నుంచి సీనియర్ అసిస్టెంట్ హోదా వరకు సుమారు 45 మంది వరకు విధుల్లో ఉన్నారు. వీరంతా పరిపాలనా విభాగ సూచనల మేరకు మాత్రమే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కొంత కాలంగా సాగుతున్న వర్గ పోరులో భాగంగా సుమారు ఏడుగురు ఉద్యోగులకు చర్యల్లో భాగంగా 20 వరకు మెమోలు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ భవాని ప్రసాద్‌కు మూడు, సీనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్‌కు మూడు, సీనియర్ అసిస్టెంట్ చంద్రమౌళీశ్వరరావుకు రెండు, టైపిస్టు ఎస్.రామచంద్రరావుకు రెండు, టైపిస్టు ఎం.జగదీష్‌కు నాలుగు, సీనియర్ అసిస్టెంట్ విజయ సుందరీమణి (గీతాంజలి)కి మూడు, జూనియర్ అసిస్టెంట్ బి.రామచంద్రరావుకు రెండు చొప్పున మెమోలు వరుసగా జారీ చేశారు. వరుసగా మూడు మెమోలు జారీ చేస్తే చార్జి మెమో ఫ్రేమ్ చేసే అవకాశాలున్నాయి. సీసీఏ నిబంధనల ప్రకారం సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ఇంక్రిమెంట్లు కూడా కోల్పోయే ప్రమాదముందని బాధిత ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఈ వరుస వ్యవహారాలతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో మెమోల గోలపై చర్చ జిల్లా వ్యాప్తమైంది. అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని మెమోలను ఇచ్చారో.. లేక వర్గ పోరులో బలిపశువులను చేస్తున్నారో అన్న చర్చ కూడా సాగుతోంది. ఉన్నతాధికారులు జిల్లా కార్యాలయంలో 'పరిపాలన'పై ప్రత్యేక దృష్టి సారిస్తే మరిన్ని వాస్తవాలు బహిర్గతమవుతాయని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

క్లుప్తంగా

ఏనుగు పిల్ల మృతి



మృతి చెందిన ఏనుగు పిల్ల

పార్వతీపురం రూరల్: మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామ ముదిరాజు చెరువులో ఆదివారం ఉదయం ఏనుగుల గుంపులో ఉన్న పిల్ల ఏనుగు మృతి చెందింది. ఇటీవల కొద్ది వారాల నుంచి పార్వతీపురం మండలంలోని తొమ్మిది ఏనుగుల గుంపు సంచరిస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఏనుగుల గుంపులో ఉన్న పిల్ల ఏనుగును పెద్ద ఏనుగులు తొక్కడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మరణానికి కారణాలను పరిశీలిస్తున్నారు. ఈ విషయమై ఎలిఫెంట్ మానటరింగ్ అధికారి మణికంటేశ్వరరావు మాట్లాడుతూ ఏనుగు పిల్ల వయసు ఏడు నెలలని తెలిపారు. పోస్టుమార్టం నిమత్తం కొమరాడ మండలం అర్తాం తరలించామని చెప్పారు.

కారు ఢీ కొని లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు



తీవ్రగాయాల పాలై ఘటనా స్థలంలో పడి ఉన్న వెంకటరావు

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస సమీపంలో గల భారత్ పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం కారు ఢీ కొనడంతో ఓ లారీ డ్రైవర్ తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ గేదెల వెంకటరావు లారీతో విజయనగరం వెళ్తూ ముచ్చర్లవలస పెట్రోల్ బంకు వద్ద మూత్ర విజర్జన కోసం జాతీయ రహదారి పక్కన లారీ ఆపి రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. ఆ సమయంలో రామభద్రపురం నుంచి విజయనగరం వెళ్తున్న కారు లారీ డ్రైవర్‌ను ఢీ కొట్టింది. దీంతో వెంకటరావు తీవ్ర గాయాలపాలై తుళ్లిపోవడంతో మృతిచెందాడేమోనని భావించి కారు డ్రైవర్ రోడ్డు కారు రోడ్డు పక్కన పెట్టేసి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రథమ చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై వి. ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్‌బోల్తా పడి యువకుడి మృతి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామంలో వ్యాన్ బోల్తా పడి గ్రామానికి చెందిన పెనుమజ్జి కుమార్ (25) మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు..గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో భాగంగా వ్యాన్‌లో ఐరన్ రాడ్లు తీసుకువచ్చారు. ఐరన్‌లోడుతో ఉన్న వ్యాన్‌ను ఎత్తు భాగానికి ఎక్కిస్తుండగా బోల్తాపడింది. దీంతో వ్యాన్ పక్కనే ఉన్న పెనుమజ్జి కుమార్ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. తల్లిదండ్రులు ఆదిబాబు, చిట్టెమ్మ దంపతులకు కుమార్ పెద్ద కొడుకు కాగా సమీపంలో ఉన్న పవర్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.



సమావేశంలో మాట్లాడుతున్న శాసన మండలి విపక్ష నేతబొత్స సత్యనారాయణ



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం విశాఖ జిల్లా ఆనందపురంలోని ఓ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస రావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తదితర విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. – విశాఖపట్నం

మూతపడిన జనరిక్ మందుల షాపు

- అధిక ధరకు మందుల కొనుగోలు
- ఇబ్బందులు పడుతున్న పేదరోగులు

విజయనగరం ఫోర్ట్: ఏజబ్బు అయినా సరే మందుల ద్వారానే నయమవుతుంది. అధికశాతం మంది ప్రజలు బీపీ, షుగర్, ఆస్తమా, కిడ్నీ, లివర్, గుండె, అర్థరైటిస్, కీళ్ల నొప్పులు ఇలా రకరకాల వ్యాధులతో బాధపడుతున్నవారు ప్రైవేట్ మందుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాలంటే అధిక మొత్తంలో వెచ్చించాల్సిన పరిస్థితి. పేద, మధ్య తరగతి వర్గాలకు అది అదనపు భారమే. ఇటువంటి పరిస్థితుల్లో తక్కువ ధరకు మందులు లభించే జనరిక్ మందుల దుకాణం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే అవసరమైతే జనరిక్ మందుల దుకాణాలను పెంచాల్సి ఉంది. కానీ ప్రభుత్వసర్వజన ఆస్పత్రి ఆవరణంలో ఉన్న జనరిక్ మందుల దుకాణం మూత పడి రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న షాపు అకస్మాత్తుగా మూతపడినా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కువ మంది రోగులు మందుల కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నిత్యం ఓపీ విభాగానికి 1000 నుంచి 1200 మంది వస్తారు. వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు ఉచితంగా ఇస్తారు. ఆస్పత్రిలో అందుబాటులో లేని మందులను రోగులు జనరిక్ మందుల దుకాణంలో కొనుగోలు చేసేవారు. అదేవిధంగా బీపీ, షుగర్, కేన్సర్ వంటి ధీర్ఘకాలిక రోగులు కూడా ఇక్కడే మందులు కొనుగోలు చేసేవారు. ప్రైవేట్ మెడికల్ షాపుల కంటే అతి తక్కువ ధరకు మందులు లభించడంతో అధికశాతం మంది జనరిక్ మందులు దుకాణంలో కొనుగోలు చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణంలో మూత పడ్డ జనరిక్ మందుల దుకాణం

ఆదేశాల మేరకు చర్యలు

జనరిక్ దుకాణం నిర్వహించే వారికి ఆస్పత్రి నుంచి ఎటువంటి అనుమతులు లేవు, విద్యుత్ బిల్లులు కూడా ఆస్పత్రి నిధుల నుంచే కడుతున్నాం. అద్దె కూడా చెల్లించడం లేదు. దీనిపై డీఎంఈకు లెటర్ రాశాం. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ అల్లు పద్మజ, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

20 రోజులవుతున్నా పట్టించుకునే వారే కరువు

జనరిక్ మందుల దుకాణం మూత పడి 20 రోజులు దాటుతున్నా ఇప్పటి వరకు అధికారులు పట్టించుకున్న దాఖలాలులేవు. దుకాణం నిర్వహించేవారు ఎందువల్ల తెరవడం లేదనే దానిపై అధికారులు ఆరా కూడా తీయలేదని తెలుస్తోంది.

అలరించిన పెట్ షో

విజయనగరంఫోర్ట్: విజయనగర ఉత్సవాల్లో భాగంగా స్థానిక అయోధ్య మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన పెట్ షో అకట్టుకుంది. పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో పెట్ షో నిర్వహించారు. సిజ్జు, జెర్మనీ పెషర్డ్, ల్యాబ్, కొమిరేనియా, డాబర్ మెన్ తదితర 20 రకాలకు చెందిన 195 పెట్స్ (పెంపుడు కుక్కలు) షోలో పాల్గొన్నాయి. పెట్‌షోలో పాల్గొనేందుకు 170 మంది ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోగా, 25 మంది స్పాట్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. పెట్‌లో షోలో పుంగనూరు జాతి ఆవులు, విదేశీ పావురాలు, గినీపిక్స్, లవ్‌బర్డ్స్, రాబిట్స్ , పావురాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. షోలో పాల్గొన్న పెట్స్ యాజమానులకు జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జి.మహాలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్స్ డాక్టర్ కేవీ.రమణ, డాక్టర్ టి. ధర్మారావు, డాక్టర్ ఎల్, విష్ణు, డాక్టర్ ఆర్.శారద, డాక్టర్ పి.అనూరాధ, వీఏఎస్‌ల డాక్టర్ టి.మోహన్ రావు, డాక్టర్ ఎస్.జి.సాగర్, డాక్టర్ వి. భావన, డాక్టర్ ఎ.భాగ్యరాజ్, డాక్టర్ ఎల్.శ్రుతి పాల్గొన్నారు.



షోలో పెట్స్‌ను ప్రదర్శిస్తున్న యాజమానులు

ఆర్చరీలో మెరిసిన అక్కాచెల్లెళ్లు

- రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు ఎంపిక



రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లు

సీతంపేట: ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక హిమరక ప్రసాద రావు కుమార్తెలు ఎంపికయ్యారు. ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో సీతంపేట మండలం నుంచి అక్కాచెల్లెళ్లు హాజరు కాగా అండర్ 19లో హెచ్.సంయుక్త, అండర్ 17లో హెచ్.లక్షితలు ఎంపిక కావడం పట్ల ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకబ్ దయానంద్, కోచ్ మధులతో పాటు పలువురు అభినందించారు.

ప్రారంభమైన క్రీడోత్సవం



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: విజయనగర ఉత్సవాల్లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తలపెట్టిన క్రీడోత్సవం ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా మొత్తం ఏడు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన పురుష జట్లకు మాత్రమే పోటీలు నిర్వహించగా..టెన్నిస్ క్రీడాంశంలో ఉత్తరాంధ్ర స్థాయిలో పోటీలు నిర్వహించారు. చెస్ క్రీడాంశంలో 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాల,బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొనగా..ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సోమవారం సాయంత్రం బహుమతీ ప్రదానోత్సవం చేయనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి కె.శ్రీధర్‌రావు తెలిపారు. పోటీలను ఆయా క్రీడా అసోసియేషన్‌ల ప్రతినిధులు కె.జ్వాలాముఖి, కేవీఎస్ చిన్నారి, కేవీ.ప్రభావతి, వై.కుసుంబచ్చన్, నున్న సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

అలరించిన థింసా నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

విజయనగరం టౌన్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో పలువురు చిన్నారులు ఆదివారం చేసిన థింసా నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది. అలాగే బాలభవన్, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం కళాకారుల బృందాలు చేసిన జానపద కళా ప్రదర్శనలు సైతం ఆకట్టుకున్నాయి.


ఆర్థికసాయం అందజేత

భోగాపురం: మండలంలోని రామచంద్రపేటకు చెందిన ఇప్పిలి రాంబాబు అనే యువకుడికి నోడగల రాము అనే వ్యక్తి ఆర్థికసాయం చేశారు. రాంబాబు తల్లిదండ్రులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి వైద్యసేవల కోసం ఇల్లు తాకట్టు పెట్టడంతో పాటు కొంత అప్పులు చేయడం జరిగింది. ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్న రాంబాబు పరిస్థితిని తెలుసుకున్న రాము..అతడిని ఆదుకునేందుకు ముందుకువచ్చారు. రూ.50 వేలను తనవంతు సాయంగా అందజేసి, అండగా నిలిచారు.

కొట్లాట ఘటనపై కేసు నమోదు

భోగాపురం: మండల కేంద్రంలో ఈ నెల 2వ తేదీన కనకదుర్గమ్మ నిమజ్జనోత్సవంలో భాగంగా చేపట్టిన ఊరేగింపులో ఓ రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పాపారావు శనివారం తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఊరేగింపులో దుబ్బక సురేష్, లోకేశ్, అభి అనే ముగ్గురు వ్యక్తులు కలిసి మరడ వంశీ అనే వ్యక్తిని పంచాయతీ కార్యాలయం వద్దకు రమ్మని అతడిపై దాడికి ఎగబడ్డారు. ఈ దాడిలో వంశీ చేయి విరిగిపోగా అతడి స్నేహితుడు అడ్డగర్ల అరుణ్‌కుమార్..చికిత్స నిమిత్తం వంశీని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

సిరిమానోత్సవానికి రూట్‌మ్యాప్



పైడితల్లి సిరిమానోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ నిర్దేశించిన కొత్త రూట్‌మ్యాప్

ఈ దిగువన నిర్దేశించిన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నిషేధమని ఎస్పీ పేర్కొన్నారు.

1. బాలాజీ జంక్షన్ నుంచి సింహాచలం మేడ జంక్షన్
2. సింహాచలం మేడ జంక్షన్ నుంచి కోట
3. బాలాజీ జంక్షన్ నుంచి గంట స్తంభం
4. ఎం.ఆర్ కాలేజీ జంక్షన్ నుంచి గురజాడ సర్కిల్
5. కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి గంటస్తంభం
6. ట్యాక్సీ స్టాండ్ నుంచి గంట స్తంభం
7. సామ్రాట్ లాడ్జి జంక్షన్ నుంచి శివాలయం మీదుగా ఎంజీ రోడ్డు 8.కమ్మవీధి జంక్షన్ నుంచి మూడు లాంతర్లు
9. గుమ్చీ జంక్షన్ నుంచి కోట జంక్షన్ వైపు అన్ని రకాల వాహనాల రాకపోకలు నిషేధించినట్లు ఎస్పీ దామోదర్ వివరించారు.

నిషేధిత స్థలాల్లో వాహనాలు పార్కింగ్ చేసిన పక్షంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానా కూడా విధిస్తారని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు.

విజయనగరం క్రైమ్: పైడితల్లి సిరిమానోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలని ఎస్పీ దామోదర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ పైడితల్లి జాతరకు వస్తున్న భక్తులు ఈ నెల 7న తేదీన అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా వాహనాలపై వచ్చేవారికి పార్కింగ్ చేసేందుకు పలు ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. విశాఖపట్నం, కోరుకొండ, జామి, అలమండ, కొత్తవలస పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వారంతా ఎత్తు బ్రిడ్జి మీదుగా మయూరి జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వైపు వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన కాశిరాజు సర్కస్ గ్రౌండ్ అయోధ్యమైదానం, ఎంఆర్ కాలేజ్ బాయ్స్ హాస్టల్లో వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అలాగే ధర్మపురి, డెంకాడ పరిసర ప్రాంతాలనుంచి వచ్చే వాహనాలు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ మీదుగా కాశిరాజు సర్కస్ గ్రౌండ్ అయోధ్యమైదానం, ఎంఆర్ కాలేజ్ బాయ్స్ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలను పార్క్ చేయాలన్నారు. ఇక నాతవలస, శ్రీకాకుళం, భోగాపురం పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు రాజీవ్ నగర్ కాలనీ జంక్షన్, దాసన్నపేట జంక్షన్ మీదుగా అయ్యకోనేరువద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో గానీ లేదా రాజీవ్ నగర్ జంక్షన్, రింగ్ రోడ్డు మీదుగా ఫోర్ట్ సిటీ స్కూల్, ఎస్వీఎన్ లేఔట్‌లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో కానీ వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అలాగే నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, గరివిడి, గుర్ల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్ మీదగా, కొత్తపేట మంటపం పాత బస్టాండ్ మీదుగా రాజీవ్ స్పోర్ట్స్ స్టేడియం మీదుగా వచ్చి డీఎస్‌డీఓ ఇండోర్ స్టేడియంలో పార్కింగ్ చేయాలన్నారు. గజపతినగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, గంట్యాడ, ఎస్.కోట పరిసర ప్రాంతాల నుంచీ వచ్చే వాహనాలు కలెక్టర్ ఆఫీస్ నుంచి గూడ్స్ షెడ్, సీఎంఆర్ జంక్షన్ మీదుగా సీఎంఆర్ షాపింగ్ మాల్‌కు వ్యతిరేకంగా ఉన్న స్థలంలో పార్క్ చేయాలని సూచించారు. దీంతో పాటు పీజీ స్టార్ హాస్పిటల్ పక్కన గల ఖాళీ స్థలంలోను, ఎస్బీఐ జంక్షన్ నుంచి రామానాయుడు రోడ్డు మీదుగా ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద గల పార్కింగ్ స్థలాల్లో పార్క్ చేయాలని తెలిపారు. ఏడవ తేదీ ఉదయం నుంచి ఎనిమిదివ తేదీ రాత్రి పదిగంటల వరకు.

సంగీత సాహిత్య సమలంకృతే..!

- సంగీత సరస్వతికి స్వర నీరాజనం
- 32 రకాల సంగీత బృందాలు, 315 కళాకారులతో స్వరాభిషేకం
- ఆహూతుల మన్ననలు పొందిన సంగీత, నృత్యప్రదర్శనలు
- విజయనగర ఉత్సవ వేదికలో మిన్నంటిన స్వరఝరి



టి.తన్మయి బృందం చిన్నారుల నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: సంగీత సరస్వతికి స్వర నీరాజనం పలికారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన విజయనగరం ఉత్సవాల్లో సంగీత కళాకారులు కళామతల్లిని స్తుతిస్తూ చేసిన స్వరాభిషేకం ఆద్యంతం రక్తికట్టించింది. విజయనగర ఉత్సవాల్లో భాగంగా స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలలో ఘంటసాల, ద్వారం వంటి ఎందరో మహనీయులు సాధన చేసిన కచేరీ మందిరంలో 32 బృందాలు, 315 మంది కళాకారులు తమ స్వరఝరిని వినిపించి, కళ్లకు కట్టినట్లు చూపించి చూపరులను కట్టిపడేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు ఇవే..

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమాలను జ్యోతిప్రజ్వలన, ప్రార్థనాగీతాలాపన, స్వాగత నృత్యాంజలితో ప్రారంభించారు. ఎస్.గోపాలరావు బృందం నాదస్వరం, శ్రీహరి సంకీర్తన ఝరి ఎస్.వెంకటరావు బృందం గాత్రం, ఎస్.కాశీప్రసాద్ బృందం గాత్రం, కె.ఎ.పద్మప్రియ బృందం వీణకచేరీ, నర్తనశాల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ భేరిరాధికారాణి బృందం నృత్యప్రదర్శన, అమృత వర్షిణి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ టి.సౌమ్య బృందం నృత్యప్రదర్శన ఆద్యంతం అలరించాయి. టి.తన్మయి బృందం నృత్యప్రదర్శన, టి.అమ్మాజమ్మ గాత్రకచేరీ చూపరులను కట్టిపడేశాయి. సీహెచ్.శైలజ గాత్రం, ఎన్‌వీ.కామేశ్వరరావు ఫ్లూట్ ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. ఎస్‌వీఎన్.వివేక్, శరత్ బృందం మైమ్, అభినయ డ్యాన్స్ స్కూల్ ఎం.సాయి ప్రియబృందం, ఇబ్రహీం ఖాన్ బృందం దూడ శ్రీదేవి, పి.క్రిషిక, కరుణల నృత్యప్రదర్శనలు, జి.రాధిక బృందం, కె.పెంటయ్యనాయుడుల గాత్రకచేరీ, పీవీఎస్ఎల్ సారథి బృందం వయోలిన్, టి.సత్యనారాయణ బృందం నృత్యప్రదర్శన, పి.సూర్యకుమారి, కె.స్వాతిప్రియదర్శిని బృందం నృత్యప్రదర్శన, వి.అప్పలస్వామి నృత్యప్రదర్శన, ఐ.మెహరలత గాత్రకచేరీ, డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి బృందం గాత్రకచేరీ అలరించాయి.

కళాకారులకు సత్కారం

కె.విద్యాసాగర్ బృందం, డాక్టర్ మండపాక రవి మృదంగం, బి.మంజూష బృందం, ఎ.శైలజల నృత్యప్రదర్శన, శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఎం.భీష్మారావు బృందం గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం కళాకారులను నిర్వాహకులు దుశ్శాలువాలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లైఫ్ మెంబర్స్ పిళ్లా విజయకుమార్, రామయ్యపంతులు, వేదిక ఇన్‌చార్జ్ అధికారులు కవిత, జానకమ్మ, నాగలక్ష్మిలు సహకారమందించారు.

ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

- 166 విద్యాసంస్థల నుంచి 234 సైన్స్ ప్రాజెక్టు నమూనాలు



ఐటీఐ విద్యార్థులు రూపొందించిన సోలార్, విండ్ ప్రాజెక్టు నమూనాలు, వ్యర్థపదార్థాల కళాఖండాలు

విజయనగరం అర్బన్: విజయనగర ఉత్సవాల్లో పాఠశాల విద్యార్థులు ఆదివారం ప్రదర్శించిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 166 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ విద్యాసంస్థల విద్యార్థుల నుంచి 234 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. ఇందులో 150 పాఠశాలల నుంచి 182, 15 కళాశాలల నుంచి 32, ఒక ఐటీఐ నుంచి 20 ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించారు. ప్రదర్శనలో ఉంచిన పలు నమూనాలు సందర్శకులను ఆలోచింపచేశాయి. ఐటీఐ విద్యార్థులు రూపొందించిన వ్యర్థ ఇనుప పదార్థాల నుంచి సృజనాత్మక పరికరాలు, సోలార్, విండ్ విద్యుత్ ఉత్పాదక నమూనాలు ఆకట్టుకున్నాయి. తాటిపూడి రిజర్వాయర్, భోగాపురం విమానాశ్రయం, దేశంలో ప్రసిద్ధి చెందిన హిందూదేవాలయాల నమూనాలు, డ్రోన్లు, క్రాఫ్ట్, ఆర్ట్ కళల చిత్రలేఖన ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్‌సీలు డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, డీఈఓ యూ.మాణిక్యం నాయుడు పాల్గొన్నారు.

అర్ధరాత్రి లాఠీ చార్జ్

- జమ్ము గ్రామంలో ఉద్రిక్తత
- గ్రామస్తులపై విరుచుకుపడిన పోలీసులు
- పలువురికి గాయాలు



పోలీసుల లాఠీచార్జ్‌లో గాయాపడిన ఆనంద్‌ను పరామర్శిస్తున్న గుర్ల వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: మండలంలో ఇంతవరకూ లేని సంస్కృతిని పోలీసులు అలవాటు చేస్తున్నారు. కూటమి నేతల ఆశీస్సులు పొందేందుకు వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష కట్టి అన్యాయంగా లాఠీ చార్జ్ చేస్తూ భయభ్రాంతులకు గురుచేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రశాంతంగా ఉండే గ్రామం మండలంలోని జమ్ము. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఆ గ్రామంలో టీడీపీ నేతలు పెత్తనం చేయడానికి ప్రయత్నించారు. కానీ వీలు పడకపోవడంతో గ్రామంలో ఎదో ఒక అలజడి సృష్టించి పోలీసులను, అధికారులను రంగప్రవేశం చేయించి వారిపై తీవ్ర ఒత్తిడి చేసి వారి మాటను నెగ్గించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీని పర్యావసానంగా గ్రామంలో శనివారం దేవీ విగ్రహ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుగుతుండగా అర్ధరాత్రి సమయంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మహిళలు, పెద్దలు, యువతపై పోలీసులు ఒక్కసారిగా లాఠీ చార్జ్ చేశారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ లాఠీ చార్జ్‌లో గ్రామానికి చెందిన సారంపాటి ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో పది మంది మహిళలకు ఒంటిపై పోలీసుల లాఠీ దెబ్బలు తీవ్రంగా కనిపిస్తున్నాయి.



లాఠీచార్జ్‌లో గాయాలైనట్లు చూపిస్తున్న సువ్వాడ సూర్యనారాయణ

పోలీసుల తీరుకు ఖండన

జమ్ము గ్రామంలో దేవీ విగ్రహ నిమజ్జనోత్సవం జరుగుతుండగా వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేసి విచక్షణా రహితంగా కొట్టడాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్టీఐ వింగ్ కార్యదర్శి కెంగువ మధుసూదనరావు, నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు తీవ్రంగా ఖండించారు. ప్రశాంతమైన పల్లెలో అలర్లు సృష్టించి ఉద్రిక్త వాతావారణాన్ని నెలకొల్పుతున్న పోలీసుల తీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల లాఠీ చార్జ్‌లో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కొట్టక్కి ఉన్నత పాఠశాలకు పురస్కారం



కొట్టక్కి ఉన్నత పాఠశాల

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలకు అరుదైన పురస్కారం లభించింది.గత ప్రభుత్వంలో నాడు నేడు కింద కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్మించిన అదనపు తరగతి గదులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, అలాగే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిశుభ్రత, పచ్చదనం,పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికి గుర్తింపు లభించింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర-2025 జిల్లాస్థాయిలో ప్రభుత్వం పాఠశాలల విభాగంలో మొదటి స్థానం దక్కించుకుంది.ఈ నెల 6వ తేదీన జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత హెచ్ఎం అవార్డు అందుకోనున్నారు.

సంతోషంగాఉంది..

మా పాఠశాల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కింద పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఇది మా పాఠశాల సాధించిన ఘనత. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది.

– ఆమిటి శ్రీనివాసరావు, హెచ్ఎం ఉన్నత పాఠశాల కొట్టక్కి